

# గణపతి

గోవిందరాజు రామకృష్ణారావు

**చంద్రశేఖరానికి** ఆస్తికభావం బాల్యం నుంచే అలవడింది. అసలు అతని కుటుంబంలోనే అలాంటి వాతావరణం అలుముకుంది. పూజలూ, ఆరాధనలూ తరచు అక్కడ జరుగుతుంటాయి. మనస్తత్వానికీ, అభిరుచికీ తగినట్టు అతను పిహెచ్.డి. పరిశోధన కోసం ఆసక్తికరమైన అంశం ఎంచుకున్నాడు. ఆధునికకాలంలో, అంటే పందొమ్మిదవ శతాబ్ది రెండో దశకం తర్వాత తెలుగునాట వెలసిన కొన్ని క్షేత్రాల మహాత్మ్యాన్ని వింగడించి చెప్పే ప్రయత్నం చేశాడు. చంద్రశేఖరం తన సిద్ధాంత గ్రంథానికి తీసుకున్న పరిధి అత్యంత విస్తృతమైంది. అన్ని మతాలకూ చెందిన ప్రసిద్ధ ఆరాధనా స్థలాలను అతను దర్శించి, వస్తు సేకరణ చేసి సప్రమాణంగా, రసస్ఫోరకంగా రాసిన గ్రంథ మది. ఆలయాలు, చర్చిలు, దర్గాలు, గురుద్వారాలు, ప్రార్థనా స్థలాలు, మందిరాలు - ఇలా ఎన్నెన్నో దివ్యక్షేత్రాల చరిత్రలు అక్షరబద్ధమయ్యాయి. ప్రతి గాథా పాఠకుల్లో కొత్త అనుభూతి నింపుతుంది. వాచవిగా ఒక చరిత్ర వినండి.

భవానీ నదీ ప్రవాహం చిత్రంగా సాగుతుంది. అలలు ఒక్కోసారి ఎడమవైపు దూసుకుపోతాయి. దట్టంగా పరచుకున్న అడవిలోని మృగాన్ని అదిలించినట్టు ఉద్రేకంతో ఒడ్డును తాకుతాయి. మరోసారి కుడివైపున వెలసిన పద్మనాభస్వామికి నమస్కరిస్తున్నట్టు తలలెత్తి తీరాన్ని వినమ్రంగా స్పృశిస్తాయి.

ఒక్క నదీ జలాలే కాక, పంచభూతాలూ ఆ స్వామి కటాక్షాన్ని అపేక్షిస్తాయి. కరుణామూర్తి ఆ స్వామి అక్కడ ప్రకృతికి ప్రసాదించిన వరాలు అబ్బురంగా ఉంటాయి. పరిసర రమణీయకత చూడడానికి రెండు కళ్లూ చాలవు. ఇక వర్ణించడం పంకజభవునికేమైనా సాధ్యమేమో!

అది రామగిరి సంస్థానం ఏలుబడిలో ఉన్న ప్రాంతం. సంస్థానాధీశ్వరులైన నృసింహ భూపతులవారు భక్తితత్పరులు, రసహృదయులు. ఈ ప్రాంతం సందర్శించినప్పుడు ప్రభువులు పరవశించిపోయారు. ఆ రాత్రి వారి ఇలవేల్పు పద్మనాభస్వామి స్వప్నంలో దర్శనమిచ్చారు. అదే స్వామి ఆజ్ఞగా ప్రభువులు గుర్తించగలిగారు. భవానీ నది దక్షిణ తీరాన ఆలయం నిర్మించి దాన్ని భూలోక వైకుంఠంగా చేయాలన్న సంకల్పం కలిగింది. ధర్మపత్ని లలితాదేవి అభిమతం కూడా అదే. నృసింహభూపతులు సాహిత్య నిధులే కాక, బహుశాస్త్రపారంగతులు కూడా. ఆలయ నిర్మాణానికి సంబంధించిన శాస్త్రాంశాలు చర్చించి నిర్ణయించడం కోసం, సుదూర ప్రాంతాల నుంచి పండిత ప్రకాండుల్ని ఆహ్వానించారు. ఆ సమావేశం దేవ సభను మరిపించింది. ప్రభువుల మన్ననలు పొందడం కోసం సర్వశక్తులూ ఉపయోగించి ఒకరిని మించి ఒకరు సూచనల వర్షం కురిపించారు.

గుణగ్రహణ పారీణులు కాబట్టి నృసింహభూపతులు ఉత్తమోత్తమంగా తోచినవాటిని స్వీకరించి నిపుణులచేత ఆలయానికి రూపకల్పన చేయించారు. దైవజ్ఞులు

నిర్ణయించిన సుముహూర్తాన ఆలయ నిర్మాణం ప్రారంభమైంది. అనతికాలంలోనే అద్భుత దివ్యధామం అవతరించింది. ప్రతిభాగం సౌందర్య నిదానంగా అలరారింది. విగ్రహ ప్రతిష్ఠకు నలుమూలల నుంచీ పీఠాధిపతులు విచ్చేశారు. ఆ క్షేత్రం 'పద్మనాభపురం'గా దినదినాభివృద్ధి చెందింది.

పద్మనాభస్వామి దివ్యమంగళ రూపం భక్తకోటిని సమ్మోహనపరుస్తోంది. ఆలయ నిర్మాణంతో జన్మ సార్థకమైనట్టు నృసింహభూపతులు, లలితాదేవి భావించారు. భూపతులకు కుటుంబంలో ఏకాదశి పవిత్ర దినంగా పాటించే ఆచారం అనుస్యూతంగా వస్తోంది. అందుచేత పద్మనాభస్వామి ఆలయంలో ప్రతి నెలా శుక్ల ఏకాదశినాడు ప్రత్యేక పూజలు జరుగుతాయి. ప్రభువులు సతీసమేతంగా ఆనాడు స్వామివారి దర్శనం చేసుకుంటారు. ప్రతి సంవత్సరం ఆషాఢశుద్ధ ఏకాదశినాడు మహోత్సవాలు నిర్వహిస్తారు. సంస్థానం నలుమూలల నుంచే కాక అనేక ప్రాంతాల నుంచి ప్రజలు అసంఖ్యాకంగా వస్తారు. అనేక ఇతర కార్యక్రమాలతోపాటు కవి, పండిత గోష్ఠి ఉంటుంది. సత్కారాలు జరుగుతాయి.

ఆనాడు స్వామి రూపం భువనమోహనంగా ఉంటుంది. స్వామి దర్శనం చేసుకుని జన్మ పావనమైందని ప్రజలు భావిస్తారు. మండపంలో అలంకృత వేదికపైన ఆసీనులైన నృసింహభూపతులను చూసి వారి కృపానంద వీక్షణాలు పొందడం పరిపాటి. పండితులు సత్కారాలు, సన్మానాలు అందుకుంటారు.

ఆషాఢ శుద్ధ ఏకాదశి ఎప్పుడు వస్తుందా, ఆ మహోత్సవం కనులారా ఎప్పుడు చూద్దామా అని ముముక్షువులు నిరీక్షిస్తుంటారు.


** ** **

ఒక సంవత్సరం పద్మనాభపురంలో జరిగిన అద్భుత ఘటన తలుచుకుని తన్మయులు కానివారు లేరంటే అది అతిశయోక్తి కాదు.

నృసింహభూపతులు యథాప్రకారం మండపంలో ఉన్నతాసనంపై అధిష్ఠించి పండిత గోష్ఠిలో నిమగ్నులై ఉన్నారు. దూరంగా గజ ఘీంకారం వినిపించింది. ఆ ధ్వని కర్కశంగా లేదు. మృదులంగా ఉంది. భక్తిభావ పరిపూర్ణంగా ఉంది. స్వామి నామస్మరణ ఉంది.

ఆలయ ప్రాంగణంలో చేరిన అశేష జనావళి ఆశ్చర్యపోయింది. ఆ శబ్దం చేరువవుతోంది. గజరాజు రాజమార్గం గుండా ఆలయ ప్రధాన ద్వారం సమీపించింది. భటులు వారించినా గమనం ఆపలేదు.

గజ శాస్త్రం తెలిసి, గజ పాలనలో ప్రవేశం ఉన్న యువ భటుడు వెంకటపతి పరుగుపరుగున వెళ్లి గజరాజుకు అడ్డంగా నిలుచున్నాడు. అతనికే ప్రమాదం వాటిల్లుతుందో నని తోటి భటులు, సామాన్య ప్రజలు భయభ్రాంతు లయ్యారు. గజరాజు వేగం తగ్గించి ప్రధాన ద్వారం దగ్గర ఆగింది. వెంకటపతి గజరాజును అనుసరించాడు. తొండంతో అతన్ని నెమ్మదిగా పక్కకు తప్పించింది. ముందుకు సాగింది.




ధ్వజస్తంభం చేరుకుంది. స్వామికి ప్రణమిల్లింది. తొండం పైకెత్తి జయ ధ్యానం చేసింది.

ప్రభువులూ, పండితులూ ఈ అత్యద్భుత చర్యను చూసి నిశ్చేష్టులయ్యారు. గజరాజును ఏమీ చేయవద్దని ప్రభువులు సంకేతంతో ఆదేశించారు.

గజరాజు తర్వాత ధ్యాన ముద్ర వహించింది. యోగిపుంగవుడిలా ఉంది. తపోనిష్ఠలో ఉన్న నగంలా ఉంది.

ఈ ఘటనను వివరించవలసిందిగా అక్కడున్న ప్రముఖ దైవజ్ఞ శేఖరుల్ని ప్రభువులు అడిగారు. ఏనుగు స్వామికి నమస్కరించిన ముహూర్తం అసామాన్యమైందనీ, దాని భంగిమ స్వామి సేవా లక్ష్య సూచకమనీ విశదీకరించారు. వెంకటపతి దాని పక్కనే నిల్చుని గమనిస్తున్నాడు.

ఏనుగు భవానీ నదిని ఈదుకుంటూ వచ్చిందనీ, అది అడవిలో తిరుగుతూండేదనీ ప్రజలు చెప్పుకుంటూ ఆ వింతను అబ్బురంగా చూస్తున్నారు.

గజరాజు లేచింది. దాన్ని అడవికి పంపే ప్రయత్నం చేయమని వెంకటపతిని ఆదేశిస్తూ కబురు పంపారు.

గజం కదిలింది. కాని ప్రాంగణం దాటి పోవడానికి సమ్మతించలేదు. ఈ వర్తమానం భూపతులకు అందింది.

"ప్రభూ! పురాకృతపుణ్య విశేషం వల్ల గజేంద్రుడు ఈ పర్వదినాన స్వామి సేవకు అంకితమయ్యేందుకు వచ్చినట్టు స్పష్టమవుతోంది. బలవంతంగా అడవికి తరమడం సముచితంగా ఉండదేమో నని మనవి!" ఒక పండితుడు సూచించాడు. ఇతరులు కూడా సమర్థించారు.

ఇది సహేతుకమేనని భావించి ప్రభువులు చిరునవ్వులు చిందిస్తూ తల పంకించారు. వెంటనే తగిన ఏర్పాట్లకు ఆదేశాలు ఇచ్చారు. ఆ గజానికి నక్షత్ర బలం ప్రకారం 'గణపతి' అని నామకరణం చేశారు. గజ సంరక్షణ బాధ్యతలు వెంకటపతికి అప్పగించారు.

** ** **

గణపతి పద్మనాభస్వామి సేవకు అంకితమైతే, వెంకటపతి గణపతి సంరక్షణకు అంకితమైనట్టు తోస్తోంది. గణపతి భక్తి భావం అందరినీ ముగ్ధుల్ని చేస్తే, వెంకటపతి సేవాధర్మం ప్రతిఒక్కరినీ ఆశ్చర్యపరుస్తోంది.

గణపతి కోసం ఏర్పాటైన గజశాలే వెంకటపతి ఆవాసం. అతనికి గణపతితోనే లోకం. గణపతే సర్వస్వం. అతనికి వివాహేచ్ఛ ఎన్నడో నశించింది. ఉదయం గణపతిని నదిలో స్నానం చేయించి, సంప్రదాయబద్ధంగా అలంకరిస్తాడు. స్వామి దర్శనం అయితే గాని గణపతి గడ్డి పరక కూడా ముట్టదు.

స్వామివారిని తన వీపుమీద అంబారీలో ఎక్కించుకుని వెళ్తున్నప్పుడు గణపతి ఆనందం వర్ణనాతీతం. తన జన్మ చరితార్థమైనట్టు ప్రతి కదలికలోనూ వ్యక్తం చేస్తుంది.

స్వామిని దర్శించిన భక్తులంతా గణపతిని కూడా చూడడం ఆనవాయితీగా మారింది. గణపతి ఆలయానికి రావడం, అక్కడే ఉండిపోవడం భూపతులకు ఆనందహేతువైంది.

ఏకాదశి మహోత్సవంలో గణపతికి ప్రత్యేకాలంకరణ జరుగుతుంది. ప్రభువులు అందుకోసం అనేక ఆభరణాలు తయారుచేయించారు. తనకే ఈ ఆభరణాలన్నీ చేయించినట్టు వెంకటపతి సంబరపడిపోతాడు. అదొక అనిర్వచనీయ బంధం. జన్మజన్మల సంబంధం. గణపతికీ, వెంకటపతికీ మధ్య పెరిగిన మమతాను రాగాలు మాటలకందవు. ఒకరిని విడిచి ఒకరు ఉండలేరని మాత్రం ఆ ఇద్దరికీ తెలుసు.

** ** **

కాలగమనం నిరంతరం ముందుకు సాగిపోతుంటుంది. ఎప్పుడూ ఎక్కడా ఆగడం దాని నైజం కాదు. వచ్చే మార్పులన్నింటినీ తనలో ఇముడ్చుకుని వెళ్లిపోతుంటుంది. కళ్లముందే వర్తమానం గతంగా మారిపోతుంది.

పద్మనాభపురం కూడా కాలం తెచ్చే పరిణామాలకు అతీతం కాదు. దేశ స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు రద్దయ్యాయి. రామగిరి సంస్థానం అందులో ఒకటే కదా! నృసింహభూపతులు కాలధర్మం చెందారు. ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారి ఔదార్యాన్ని పదేపదే స్మరించుకుని, వారి జ్యేష్ఠ

కుమారులు నందభూపతులు శక్తివంచనలేకుండా ఆలయ నిర్వహణ బాధ్యత వహించారు. అయితే ఎక్కువ కాలం ఇది సాగలేదు.

పద్మనాభస్వామి ఆలయాన్ని ప్రభుత్వం దేవాదాయ చట్టం పరిధిలోకి తెచ్చింది. కార్య నిర్వహణాధికారి దైనందిన కార్యకలాపాలు సాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వెంకటపతి ఆలయోద్యోగిగా కొనసాగడానికి వీలు లేదన్నారు. భృతి సౌకర్యం కల్పించి పని మానుకోమన్నారు. అతని స్థానంలో మరొకరు నియుక్తులయ్యారు.

వెంకటపతికి ప్రపంచం శూన్యమైపోయింది. ఒక క్షణం కూడా గణపతిని వదలలేని స్థితి అతనిది. స్వచ్ఛందంగా ఆలయంలో సేవకు అవకాశం లేదన్నారు. గణపతికి సేవచేయకుండా పద్మనాభపురంలో ఉండలేడు. మిత్రుల సూచన మీద తీర్థ యాత్రలకు అనిష్టంగానే బయలుదేరాడు. మనస్సు నిలకడగా లేదు. ధ్యానంతా గణపతిపైనే. ఏ ఆలయానికి వెళ్లినా కనిపించేది గణపతిరూపమే.

వెంటనే పద్మనాభపురానికి తిరుగు ప్రయాణమయ్యాడు. సరాసరి ఆలయానికే వచ్చాడు. గజశాలలోకి పరుగు పరుగున వెళ్లాడు. గణపతి జాడ లేదు. ఆలయోద్యోగులు పిడుగులాంటి వార్త చెప్పారు. వెంకటపతి వెళ్లాక గణపతి గుక్కెడు నీళ్లు తాగలేదు, గడ్డిపోచ తినలేదు. బెంగతో అలమటించింది. గణపతిది మూగవేదన. చివరకు ఒకనాటి ఉదయానే స్వామికి నమస్కరించి ఘీంకరిస్తూ నది దాటి అడవిలోకి వెళ్లిపోయింది - వెంకటపతిని వెతుక్కుంటూ. ఎందరు ప్రయత్నించినా గణపతిని ఆపలేకపోయారు.

ఈ వార్త విని వెంకటపతి దిగ్భ్రాంతి చెందాడు. తప్పు చేసినవాడి మాదిరి తపించిపోయాడు. తనను తిట్టుకున్నాడు, శపించుకున్నాడు, రోదించాడు. ఉన్మత్తుడిలా నది దిశగా వడివడిగా నడిచాడు. ఎవరూ వెంకటపతిని ఆపలేకపోయారు. "గణపతీ! గణపతీ! గణపతీ!" అంటూ దిక్కులు పిక్కటిల్లేటట్టు పిలుస్తున్నాడు. బదులు రాలేదు. నడక వేగం పెరిగింది. పిలుపు ధ్వని రెండింతలయింది. ఎక్కడినుంచి వచ్చిందో ఆ శక్తి! అందరూ చూస్తూండగానే నదిని దాటి అడవిలోకి "గణపతీ!" అని ఆక్రందిస్తూ ప్రవేశించాడు.

నది దక్షిణ తీరాన ప్రజలు స్థాణువులై నిలుచుండిపోయారు హృదయ వేదనతో.

పద్మనాభపురం ప్రజలు ఒక రోజు చూశారు, రెండు రోజులు, మూడు రోజులు చూశారు. వెంకటపతి తిరిగి రాలేదు. మిత్రులూ, ఔత్సాహికులూ అన్వేషణకు నడుం కట్టారు. అడవిలో తీరం నుంచి దూరంగా గణపతి, వెంకటపతి విగతజీవులై కనిపించారు. గణపతి తొండంతో వెంకటపతిని పొదివి పట్టుకుని పడి ఉంది. ఇద్దరి చెక్కిళ్లపై కన్నీటి ధారల గుర్తులున్నాయి. ఇద్దరూ ఏకకాలంలో పద్మనాభస్వామిలో ఐక్యమైపోయినట్లు అన్వేషకులు నిర్ధారించారు.

భక్తి శ్రద్ధలతో అంత్యక్రియలు జరిపారు.

అడవిలో సాయుజ్యం చెందిన చోట గణపతి మందిరం వెలిసింది. పద్మనాభపురవాసులే కాకుండా అనేక ప్రాంతాల భక్తులు ఎన్నో శ్రమలకోర్చి వచ్చి గజరూపంలోనే ఉన్న గణపతి విగ్రహ ప్రతిష్ఠను తిలకించారు. ద్వారం వద్ద వెంకటపతి ప్రతిమరూపంలో సంరక్షకుడుగా నిలిచాడు. పద్మనాభపురం దగ్గర భవానీ నదిని దాటడానికి పడవలు ఏర్పాటయ్యాయి. వంతెన కోసం ప్రభుత్వానికి విన్నపాలు పంపారు. త్వరలో వంతెన నిర్మాణమవుతుంది. అడవిలో మందిరం వరకు కార్లు వెళ్లే బాట వేశారు. నది దాటడానికి బల్లకట్లు వచ్చాయి. మందిరం పరిసరాలు శుభ్రపరిచారు. విద్యుచ్ఛక్తి వచ్చింది. దుకాణాలు వెలశాయి. ఇతర సౌకర్యాలు అమరాయి. చిత్తశుద్ధితో కోరితే కోర్కెలు ఈడేరతాయని ప్రజల నమ్మిక. దృష్టాంతాలు చెప్పుకుంటున్నారు. పద్మనాభపురం వచ్చిన వారంతా తప్పకుండా గణపతి మందిరం దర్శిస్తారు. ఇప్పుడా ప్రాంతం పేరు 'పద్మనాభ గణపతి పురం'.

అనతికాలంలోనే అది ప్రసిద్ధ క్షేత్రమవుతుందని చంద్రశేఖరం తన గ్రంథంలో దృఢవిశ్వాసం ప్రకటించాడు. ●


## లెనిన్ చరిత్ర

లెనిన్ జీవిత చరిత్రను తొలిసారిగా ఆంగ్లంలో రచించిన ఘనత, ఖ్యాతి మన ఆంధ్రులకే దక్కుతుందంటే - వింతగా లేదటండీ...?

ఆంధ్ర రాష్ట్రంలోని గుంటూరు పట్టణానికి చెందిన దివంగత శ్రీ జి.వి.కృష్ణారావు గారు 1912లో లెనిన్ గారి ఆటోబయోగ్రఫీని మొట్ట మొదటిసారిగా ఆంగ్లంలో రాశారు.

ప్రస్తుతం ఈ గ్రంథం - మాస్కోలో ఉన్న 'విప్లవం' కొరకై ప్రత్యేకించి ఏర్పరచిన ప్రదర్శనశాలలో ప్రముఖంగా ప్రదర్శించబడుతోంది. ఈ నిజం, భారతీయుల సంగతలా ఉంచితే... ఆంధ్రుల మయిన మనలో ఎందరికి తెలుసు....?

సేకరణ: ముద్దా రమణమూర్తి [అనంతపురం]



## కంటిశుక్లాలకు తేలిక చికిత్స

కాట్రాక్టు [కంటి శుక్లం] శస్త్ర చికిత్సలో చాలా మార్పులు వచ్చాయి. చాలా తక్కువ సమయంలో తక్కువ బాధతో, ఇబ్బందితో చికిత్స జరుగుతోంది. కాని కాట్రాక్టు ఏర్పడకుండా చాలా కాలం వాయిదా వేయవచ్చునన్నది మరచి పోకూడదు. పదేళ్లు దాని నావగలిగామనుకోండి, అప్పుడు శస్త్ర చికిత్స అవసరం 45 శాతం తగ్గిపోతుంది.

కొత్త ఢిల్లీలోని డా॥ కె.ఎల్.చోప్రా, డా॥ కె.కె. అగర్వాల్ ఈ సందర్భంలో కొన్ని సూచనలు చేస్తున్నారు.

* కెరోటిన్ ఎక్కువగా ఉండే ఆహారం, [బచ్చలి, కేరట్ వగైరాలతో కూడుకున్నది] ఏ,సి,ఈ, విటమిన్లు, రిబోఫ్లావిన్ [బి విటమిన్‌లోని అంశం] ఉన్న పదార్థాలు తింటే కాటరాక్టు ఏర్పడదు.

* సూర్యరశ్మికీ, అల్ట్రావయొలెట్ కిరణాలకూ అంతగా గురి కాకూడదు. సూర్యరశ్మి నేరుగా తగలడం రెట్టింపైతే కాటరాక్టు ఏర్పడడంతో 160 రెట్ల వృద్ధి కానవస్తుంది. పరిశోధనలు తెలుపుతున్నాయి. అల్ట్రా వయొలెట్ కిరణాల నుంచి కాపాడు కోవటానికి మంచి సాధనం వెడల్పు అంచు ఉన్న హాట్ వాడటం.

* పొగతాగే వారు మామూలు వారికన్నా 2.5 రెట్లు కాటరాక్టుకు గురి అయ్యే అవకాశముంది. ఎన్ని ఎక్కువ సిగరెట్లయితే అంత ఎక్కువ ప్రమాదం

వానమూర్తి, హైదరాబాద్